# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 13-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే “స్త్రీ శక్తి” పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 15 వ తేదీన ప్రారంభించనున్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఈరోజు నలుగురు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు.
- ❖ ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ఏర్పాటయిన మంత్రి వర్గ ఉపసంఘం ఈనెల 29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించనుంది.
- ❖ ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం అల్పపీడనం ఏర్పడింది.

======================

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే “స్త్రీ శక్తి” పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 15వ తేదీన ప్రారంభించనున్నారు. ఆగస్టు 15 శుక్రవారం సాయంత్రం విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సిటీ టెర్మినల్ లో జరగనున్న కార్యక్రమంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారని ఎన్టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలియజేశారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో ఆమె ఈరోజు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి ప్రాంగణానికి చేరుకునే ప్రాంతంలో ఏవిధమైన ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

======================

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ఈరోజు నలుగురు న్యాయమూర్తులు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర హైకోర్టులో ఇప్పటి వరకూ అదనపు న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ హరినాధ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి మండవ, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ లను న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మొదటి కోర్టుహాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆ నలుగురి చేత ప్రమాణం చేయించారు.

=====================

రాష్ట్రంలో జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పులపై ఏర్పాటయిన మంత్రి వర్గ ఉపసంఘం ఈనెల 29, 30 తేదీల్లో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో పర్యటించనుందని రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఆయనతో పాటు ఏడుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం తొలిసారిగా ఈరోజు రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యింది. డిసెంబర్ 31లోగా జిల్లాల పేర్లు, సరిహద్దుల మార్పుల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండగా మంత్రివర్గం తన నివేదికను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి ముఖ్యమంత్రికి సమర్పిస్తుందని సత్యప్రసాద్ తెలిపారు. ప్రజలు సెప్టెంబర్ 2 వరకు తమ వినతులను కలెక్టర్లకు అందిచ్చవచ్చని చెప్పారు. పరిపాలనా సౌలభ్యతకు ప్రాధాన్యమిస్తూ ఉపసంఘం తన నివేదికను రూపొందిస్తుందని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

=====================

సామాజిక మాధ్యమాలలో ఆకాశవాణి కడప కేంద్రం పేరిట ప్రచారమవుతున్న వార్తా ప్రసారం ఆడియోతో ఆకాశవాణికి ఎటువంటి సంబంధం లేదని శ్రోతలు గమనించాలి. కడప కేంద్రం నుండి ఎటువంటి వార్తా ప్రసార కార్యక్రమాలు లేవని ఆకాశవాణి శ్రోతలకు స్పష్టం చేస్తోంది. వార్తా ప్రసార కార్యక్రమాల కోసం ఆకాశవాణి అధికారిక సామాజిక మాధ్యమాల ఖాతాలను మాత్రమే అనుసరించాలని కోరుతోంది.

=====================

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమీక్షకు మంత్రులు వంగలపూడి అనిత, నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, విపత్తు నిర్వహణ జలవనరుల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రాగల రెండు, మూడు రోజుల పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువన ఉన్న ప్రాంతాలను అప్రమత్తం చేయాలన్నారు.

విరామం

=====================

ఎందరో మహనీయుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య దినోత్సవం అని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. ఈరోజు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు పట్టణంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేడు మనమంతా స్వయం పాలనతో స్వేచ్ఛగా జీవిస్తున్నామంటే దానికి కారణం ఎందరో మహనీయుల త్యాగ ఫలితమేనని చెప్పారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు దేశ పౌరులలో ఐక్యత, సోదరభావం, సేవా తత్పరతను పెంపొందిస్తాయని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

స్వర్ణాంధ్ర నిర్మాణానికి ప్రగతి సూచికలే పునాదులని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.. విజయవాడ ఇరిగేషన్ కాంపౌండ్‌లోని రైతు శిక్షణా కేంద్రంలో ఎన్‌టీఆర్ జిల్లా మూడవ సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం ఈరోజు ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశతో పాటు పలువురు శాసనసభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు సానుకూల దృక్పథంతో పనిచేయాలని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, స్వర్ణాంధ్ర లక్ష్యాలను చేరుకునేందుకు నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. డీఆర్‌సీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి సూచిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

=======================

ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఈరోజు ఉదయం ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీనికి సంబంధించిన ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి దక్షిణ దిశగా వంగి ఉందని, అది తదుపరి 24 గంటల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. మరిన్ని వివరాలను వాతావరణ శాఖాధికారి కరుణా సాగర్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా రేపు రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించారు. బలమైన గాలులు గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగం తో వీచే అవకాశం ఉందని హెచ్చరించారు.

=======================

విశాఖపట్టణాన్ని మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చుదిద్దుదామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్దేశాల మేరకు జిల్లా కలెక్టరేట్ లో ఈరోజు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా ఆయన జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది చేత నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు.

=======================

=======================